ప్రజాశక్తి
గురువారం 7 నవంబర్ 2024
శ్రీ సత్యసాయి





మోటార్‌ను ప్రారంభిస్తున్న మున్సిపల్ కమిషనర్ సంఘం శ్రీనివాసులు

గొల్లపల్లి రిజర్వాయర్‌లో

రెండవ మోటార్ ప్రారంభం

ఫలించిన కమిషనర్ శ్రమ

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించాలన్నా కమిషనర్ చొరవ ఫలించింది. గొల్లపల్లి నీటి రిజర్వాయర్ వద్ద రెండవ మోటార్ బుధవారం నుంచి వినియోగంలోకి వచ్చింది. హిందూపురం పట్టణంలో నెలకొన్న నీటి సమస్యపై ప్రజాశక్తి ప్రత్యేక కథనల రూపంలో సమస్యను వెలుగులోకి తీసుకొచ్చింది. దీనిపై ప్రత్యేక దృష్టి సారించిన మున్సిపల్ కమిషనర్ సంఘం శ్రీనివాసులు మున్సిపల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బాలసుబ్రమణ్యం, ఎఈ జనార్ధన్‌లతో కలిసి సమస్యపై చర్చించారు. వారు గొల్లపల్లిలో ఒక మోటార్ మాత్రమే పని చేస్తున్నదని, ఏ క్షణంలో ఆగిపోయినా పట్టణానికి నీటి సరఫరా ఆగిపోతుందని వివరించారు. దీంతో సమస్యను ఎలాగైనా పరిష్కరించాలని ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగారు. వెంటనే గొల్లపల్లి ఇంటెక్ వెల్ వాటర్ సప్లై వద్ద 350 హెచ్‌పి మోటార్‌ను ఏర్పాటు దానిని బుధవారం మున్సిపల్ కమిషనర్ సంఘం శ్రీనివాసులు ఇంజినీర్లతో కలిసి ప్రారంభించారు. అదే విధంగా మోటార్లు సక్రమంగా పని చేయాలంటే ప్యానల్ బోర్డు సైతం బాగా ఉండాలని సూచించి, వెంటనే మరమ్మతు పనులు చేపట్టాలని ఇంజినీర్లను కమిషనర్ ఆదేశించారు.

గొల్లపల్లి నుంచి పూర్తి స్థాయిలో నీటి సరఫరా
కమిషనర్ సంఘం శ్రీనివాసులు

హిందూపురం పురపాలక సంఘానికి గొల్లపల్లి నుంచి పూర్తి స్థాయిలో నీటి సరఫరా అవుతుందని కమిషనర్ సంఘం శ్రీనివాసులు తెలిపారు. పథకం ప్రారంభ సమయంలో మూడు ప్రాంతాల్లో పంపింగ్ స్టేషన్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. దీంతో పాటు మూడు ప్రాంతాల్లో మూడు మోటార్లు, మూడు పంపులు ఏర్పాటు చేయాల్సి ఉండగా, రెండు మోటార్లు మాత్రమే ఏర్పాటు చేశారన్నారు. ఇందులో గొల్లపల్లి రిజర్వాయర్ వద్ద ఒక మోటార్ మరమ్మతుకు గురైందన్నారు. ఒక మోటారు మాత్రమే పని చేయడంతో మరోదానిని నిలిపేయడంతో నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుండేదన్నారు. మూడు పంపింగ్ స్టేషన్లను పూర్తిగా పరిశీలించామని, మూడు ప్రాంతాల్లో మోటార్లు, పంపులు, ప్యానల్ బోర్డులను మరమ్మతు చేయించడంతో పాటు ఎస్‌కెడి నగర్ పంపింగ్ స్టేషన్ వద్ద ఒక ట్రాన్స్ ఫార్మర్ ఉండడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందన్నారు. ఇక్కడ అదనపు ట్రాన్స్ ఫార్మర్ ఉన్నప్పటికీ మరమ్మతులో ఉందన్నారు. దీనిని సైతం మరమ్మతు చేయించి, నిరంతరం విద్యుత్ సరఫరా జరిగే విధంగా చర్యలు చేపడుతాం అన్నారు. నీటి సమస్యను వెలుగులోకి తీసుకొచ్చిన ప్రజాశక్తిని కమిషనర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో



గణేష్ కూడలి నుంచి విద్యార్థులతో కలిసి కలెక్టరేట్‌కు ప్రదర్శనగా వస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు



కలెక్టరేట్ ముందు నిరసన తెలుపుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

విద్యార్థుల సమస్యలు పట్టవా..?

- ఎన్నికల హామీలను అమలు చేయాలి
- ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి
- స్కాలర్‌షిప్పులు, ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

స్కాలర్‌షిప్‌లు, ఫీజురీయింబర్స్‌మెంట్ డబ్బులు రాక విద్యార్థులు అవస్థలు పడుతున్నారని ఈ విషయం ప్రభుత్వానికి తెలిసినా మొద్దునిద్రలో ఉండడం దుర్మార్గమని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న విద్యా దీవెన, వసతి దీవెన బకాయిలు విడుదల చేయాలని, విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని, కళాశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. గణేష్ సర్కిల్ నుంచి విద్యార్థులతో కలిసి ప్రదర్శన చేపట్టారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట బైటాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వీరేష్, నాగార్జున మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలలు అవుతున్నా పెండింగ్‌లో ఉన్న రూ.3,480కోట్ల విద్యాదీవెన, వసతి దీవెన బకాయిలు విడుదల చేయలేదన్నారు. ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు అప్పు తెచ్చి ఫీజులు కట్టాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తామని హామీ ఇచ్చారని, ఇంతవరకు అమలు చేయలేదన్నారు. సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు కేటాయించాలన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్‌ఛార్జీలు 3 వేలకు పెంచాలన్నారు. మండల కేంద్రాల్లో ఏపీ మోడల్ స్కూల్స్ ఏర్పాటు చేయాలన్నారు. తల్లికి వందనం కింద ఇస్తానన్న రూ.15వేల వెంటనే విడుదల చేయాలని కోరారు. డిగ్రీలో మేజర్, మైనర్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. ఉన్నత విద్యను దూరం చేసే జీవో నెంబర్ 77 రద్దుచేసి, పీజీ విద్యార్థులందరికీ ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం స్పందించకుంటే విద్యార్థులతో కలిసి చలో అసెంబ్లీ ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు. అనంతరం డిఆర్ఒ విజయ్‌సారథిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబావలి, నాయకులు బాబ్జాన్, పవన్, హర్ష కుమార్, సాయి, సందీప్, శేషు తదితరులు పాల్గొన్నారు.

బి.అజితకు డాక్టరేట్ ప్రదానం



బి.అజిత

ప్రజాశక్తి -అనంతపురం

అనంతపురం జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో సుదీర్ఘ పరిశోధనలు చేసిన బి.అజితకు అనంతపురం జెఎన్‌టియు యూనివర్సిటీ బుధవారం డాక్టరేట్ ప్రధానం చేశారు. ఈమె అనంతపురం జెఎన్‌టియు సివిల్ ఇంజినీరింగ్ విభాగం సీనియర్ ఆచార్యులు, అనంతపురం జెఎన్‌టియు ఇన్‌ఛార్జి ఉపకులపతి హెచ్.సుదర్శన రావు పర్యవేక్షణలో సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో "ఏ స్టడీ ఆన్ ది ఎఫెక్ట్ అఫ్ ఆల్ 2ఓ3 నానో పార్టికల్స్ ఆన్ వర్కబిలిటీ, స్ట్రెంగ్త్ మరియు డ్యూరబిలిటీ, క్యారెక్టరిస్టిక్స్ అఫ్ హై స్ట్రెంగ్త్ కాంక్రీట్" అనే అంశంపై పరిశోధన చేశారు. ఈ పరిశోధనకు డాక్టర్ బి.అజితకు జెఎన్‌టియు యూనివర్సిటీ డాక్టరేట్ (పిహెచ్‌డి) ప్రధానం చేసింది. పరిశోధక విద్యార్థి బి.అజిత అనంతపురం జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల సివిల్ విభాగంలో అధ్యాపకురాలుగా, సివిల్ విభాగం విభాగ అధిపతిగా పనిచేస్తున్నారు. డాక్టరేట్ పొందిన బి.అజితను ఇన్‌ఛార్జి ఉపకులపతి ఆచార్య హెచ్.సుదర్శన్ రావు, రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య, పలువురు అధ్యాపకులు అభినందించారు.

ప్రెస్‌క్లబ్‌కు ఫ్యాన్లు, సిసి కెమెరాల వితరణ

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం ప్రెస్‌క్లబ్ అభివృద్ధిలో భాగంగా బుధవారం బిజెపి నాయకులు మేడకూర్తి హరి సీసీ కెమెరాలు, వాల్ ఫ్యాన్‌లను ప్రెస్ క్లబ్ కమిటీకి అందజేశారు. ఈ సందర్భంగా హరి మాట్లాడుతూ ప్రెస్ క్లబ్ అభివృద్ధికి సహకారం అందించడం చాల సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్తులో మరింత సహయం అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా హరిని ప్రెస్‌క్లబ్ కమిటీ సభ్యులు సన్మానించి, కృతజ్ఞతులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు రామాంజనేయులు, సెక్రటరీ ప్రశాంత్, పాత్రికేయులు ప్రదీప్, నాగేంద్ర, రాజగోపాల్, గంగయ్య, గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఉచిత ఇసుక సరఫరా

కలెక్టర్ టిఎస్.చేతన్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ టిఎస్.చేతన్, ఎస్పీ వి.రత్న

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లాలో ఉచిత ఇసుక సరఫరాను పారదర్శకంగా అమలు చేస్తామని, వినియోగదారులు ట్రాక్టర్లలో ఎద్దుల బండ్లలో తీసుకువెళ్లవచ్చు అని కలెక్టర్ టిఎస్.చేతన్ పేర్కొన్నారు. బుధవారం నాడు కలెక్టరేట్లో ఉచిత ఇసుక అమలుపై కలెక్టర్ అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ రత్న, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, జిల్లా గనుల శాఖ అధికారి పెద్దిరెడ్డి సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇసుక బుకింగ్‌ను నమోదు చేయడానికి సిబ్బందికి తగిన శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ లేదా పంచాయతీ కార్యదర్శి ఇసుక బుకింగ్ రిజిస్ట్రేషన్ కోసం వారికి తగిన బాధ్యతలు అప్పగించాలని తెలిపారు. ఉచిత బుకింగ్ నమోదు కోసం సంబంధిత మండలాల తహశీల్దారులు, ఎంపీడీవోలు, పోలీస్ శాఖ పర్యవేక్షణలో కార్యక్రమాలను నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. బుకింగ్ చేసుకున్న తర్వాత వినియోగదారులకు ఒకరోజు ముందుగానే సరఫరా చేసుకోవచ్చని తెలపవలసిన బాధ్యత అధికారులపై ఉంటుందన్నారు. వినియోగదారులకు నాణ్యమైన ఇసుక సరఫరా చేయాలని అందుకు పూర్తి బాధ్యత మైనింగ్ శాఖ అధికారులు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. నదీ పరివాహక ప్రాంతాల పరిధిలో ఉన్న గ్రామాల వినియోగదారులు ఇసుకను తీసుకు వెళ్లవచ్చన్నారు. ప్రస్తుతం ఎద్దుల బండ్లు, ట్రాక్టర్ల ద్వారా వినియోగదారులు ఇసుక తీసుకుని వెళ్లడానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. ఇకపై భారీ యంత్రాల ద్వారా ఇసుక రవాణాకూ అనుమతి ఇచ్చే అవకాశం ఉందన్నారు. ఇసుక సరఫరా నోడల్ అధికారిగా జాయింట్ కలెక్టర్‌ను నియమిస్తున్నట్లు తెలిపారు. జిల్లాస్థాయి టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణా, నిల్వ, బ్లాక్ మార్కెటింగ్ పై రోజువారిగా కేసులు రిజిస్టర్ చేయనున్నట్లు చెప్పారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ మరింత బలోపేతం చేస్తామన్నారు. మండల స్థాయిలో ఎస్‌హెచ్‌ఒ, తహశీల్దార్ సమన్వయంతో పనిచేయడం జరుగుతుం దన్నారు. డయల్ 100,102కి ఫోన్ చేసి ఎక్కడైనా ఇసుక తవ్వకాలు, లేదా రవాణా జరుగుతుంటే ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టిఒ, కరుణ సాగర్ రెడ్డి, జల వనరుల శాఖ అధికారి మల్లికార్జునయ్య, ధర్మవరం ఆర్డీవో మహేష్, అధికారులు పాల్గొన్నారు.

టమోటాకు పంటల బీమా

జిల్లాలో రబీ సీజన్‌కు సంబంధించి ఉద్యాన పంటల పరంగా టమోటా పంటను కూడా పంటల బీమా పథకంలో ప్రభుత్వం అమలు చేయనున్నదని కలెక్టర్ టిఎస్.చేతన్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. టమోటా పంటను బీమా చేసే సదుపాయం (ఇఫ్కో – టోక్యో) అనే కంపెనీ అనే కంపెనీ బీమా పథకం అమలు చేస్తుందన్నారు. ఒక ఎకరాకు కంపెనీ వారు రూ.32వేల వరకు పంటల బీమా వర్తిస్తుందన్నారు. రైతులు తమ వంతు ప్రీమియం రూ.1600 చెల్లించాల్సి ఉంటుందన్నారు. బ్యాంకులలో రుణాలు తీసుకొని రైతులు వారే సొంతంగా బీమా చేసుకోవాలి అనుకుంటే డిసెంబర్ 15వ తేదీ లోపల కామన్ సర్వీస్ సెంటర్ లేదా బ్యాంకుల ద్వారా నమోదు చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు కామన్ సర్వీస్ సెంటర్ డిఎంవి.పాండురంగారావు 7989690495 గల నెంబర్‌కు ఫోను చేసి సంప్రదించవచ్చు అన్నారు. ఒకవేళ రైతులు పంటని మార్చుకోవాలి అనుకుంటే డిసెంబర్ 15 కంటే కనీసం రెండు రోజులు ముందుగానే దరఖాస్తు చేసుకోవాలన్నారు. అప్పుడు కొత్త పంటకి కావలసిన అవసరమైన ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందన్నారు.

రోడ్డు ప్రమాదంలో క్రీడాకారిణి మృతి

ప్రజాశక్తి-పెనుకొండ



భవిత (ఫైల్‌ఫొటో)

రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని తిరిగి స్వగ్రామానికి వస్తు మార్గం మధ్యలో జరిగిన రోడ్డు ప్రమాదంలో హాకీ క్రీడాకారిణి మృతి చెందిన సంఘటన పెనుకొండ మండలం గుట్టూరు సమీపంలో బుధవారం జరిగింది. కియా ఇండస్ట్రియల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ రాజేష్ అందించిన వివరాల మేరకు పెనుకొండకు చెందిన రమేష్ రొద్దం జడ్పీ హైస్కూల్లో వ్యాయామ ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నారు. ఇతనికి సాయి భవిత(15) కుమార్తె ఉంది. సాయి భవిత పట్టణంలోని శాంతినికేతన్ పాఠశాలలో 10వ తరగతి చదువుతోంది. ఈ నేపథ్యంలో నెల్లూరులో రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో సాయి భవిత పాల్గొంది. అక్కడి నుంచి రైలులో ధర్మవరానికి వచ్చింది. రమేష్ ద్విచక్ర వాహనంలో ధర్మవరం నుంచి కుమార్తెను తీసుకుని వస్తున్నాడు. మార్గం మధ్యలో గుట్టూరు వద్ద కు రాగానే వెనుక నుంచి బొలెరో వాహనం ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. దీంతో తండ్రి కుమార్తెలిద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. గుట్టూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం సాయి భవితను బెంగళూరుకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. తీవ్రంగా గాయపడిన రమేష్ ను అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సాయి భవిత మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని పెనుకొండకు పేరు ప్రఖ్యాతలు తీసుకువస్తుందని ఎంతో ఆశించామని ఇంతలోనే ఇలా జరిగిందని శాంతినికేతన్ ఉపాధ్యాయులు, విద్యార్థులు వాపోయారు.

పరిగి ఎఎస్ఐ సస్పెన్షన్

ప్రజాశక్తి - పరిగి



ఎఎస్ఐ హిదయతుల్లా

చిలమత్తూరు మండల పరిధిలోని ఓ గ్రామంలో జరిగిన అత్యాచార ఘటనలో నిందితులుగా ఉన్న వ్యక్తుల వద్ద మూడేళ్ల క్రితం లావాదేవీలు నడపాడన్న ఆరోపణలతో పరిగి ఎఎస్ఐ హిదయతుల్లాను సస్పెండ్ చేశారు. హిందూపురం వన్ టౌన్,టూ టౌన్ స్టేషన్లో పనిచేస్తున్న సమయంలో నిందితుల నుండి కొంత నగదును తీసుకొని అన్ని విధాల సహాయ సహకారాలు అందించారన్న ఆరోపణ రావడంతో ఆయనపై విచారణ చేపట్టారు. విచారణ అనంతరం ఉన్నతాధికారులు పరిగి స్టేషన్‌లో ఎఎస్ఐగా పనిచేస్తున్న హిదాయతుల్లాను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

జాతీయస్థాయి పోటీలకు శ్రీచైతన్య విద్యార్థి

ప్రజాశక్తి - కొత్తచెరువు రూరల్

కొత్తచెరువులోని శ్రీ చైతన్య పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న సాయి త్రినేష్ గౌడ్ జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు వైస్ ప్రిన్సిపల్ బాలకృష్ణ తెలిపారు. గత నెల హిందూపురంలో ఎంజీఎం క్రీడా మైదానంలో జరిగిన అండర్ 14 రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. విద్యార్థి ఎంపిక పట్ల డీన్ హనుమంతు, ఏవో కేశవరెడ్డి, పీఈటీలు నరేంద్ర, కవిత, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

గోడ పత్రికలు ఆవిష్కరణ

ప్రజాశక్తి - కొత్తచెరువు

భారతీయ విజ్ఞాన మండలి ఆధ్వర్యంలో ప్రతి ఏటా నిర్వహించే కౌశల్ ప్రతిభ అన్వేషణ పోటీల గోడ పత్రికలను స్థానిక డిఇఒ కార్యాలయం వద్ద జిల్లా విద్యాధికారి కిష్టప్ప బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతీయ శాస్త్రవేత్తలు ప్రపంచానికి అందించిన సేవలు, ఆవిష్కరణలను విద్యార్థులకు తెలియజేసేందుకు ఈ సంస్థ నిరంతరం కృషి చేస్తోందన్నారు. ప్రతి పాఠశాల నుండి 8, 9, 10వ తరగతి చెందిన 9 మంది విద్యార్థుల పేర్లు మొబైల్ నెంబర్లతో నవంబర్ 15వ తేదీ లోపల వారి వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు, జిల్లాలోనే ప్రతి పాఠశాల నుండి క్విజ్ పోటీలకు తరగతులకు ముగ్గురు చొప్పున తొమ్మిది మందిని ఎంపిక చేయాలన్నారు. నవంబర్ 20, 21 ,22వ తేదీలలో ఆన్‌లైన్ పోటీలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇందులో గెలుపొందిన వారిలో మొదటి బహుమతికి రూ. 4,500 ద్వితీయ బహుమతికి రూ. 3 వేలు. పోస్టర్ వన్, పోస్టర్ టు, షార్ట్స్ రీల్స్, ప్రథమ బహుమతి 1500 ద్వితీయ బహుమతి వెయ్యి రూపాయలు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి తనూజ్ కుమార్, కౌశల్ రాష్ట్ర సమన్వయకర్త మనోహర్ శ్రీనివాస్ నాయక్, కౌశల్ కోఆర్డినేటర్ భాస్కర్, అదనపు కోఆర్డినేటర్ పవన్ కుమార్, ఏడీలు నాగరాజు, రామకృష్ణ, వత్తి విద్యల అధికారి లాజర్, ఉపాధ్యాయులు సురేష్, భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లు విడుదల చేస్తున్న డిఇఒ, తదితరులు

బత్తలపల్లిలో జిరాక్స్ కరెన్సీ

మోసపోతున్న చిరువ్యాపారులు

ప్రజాశక్తి - బత్తలపల్లి

మండల కేంద్రమైన బత్తలపల్లిలో కొందరు మోసగాళ్లు జిరాక్స్ కరెన్సీతో చిరువ్యాపారులను బోల్తా కొట్టిస్తున్నారు. రూ.200, రూ.500లు నోట్లను కలర్ జిరాక్స్ చేసి వాటిని వ్యాపారులకు అంటగట్టి మోసాలకు పాల్పడుతున్నారు. వాటిని బ్యాంకుల వద్దకు తీసుకువెళ్లిన వారికి బ్యాంకు అధికారులు ఇది కలర్ పేపర్స్ కదా? అంటూ తిరిగి వెనక్కి ఇస్తున్నారు. ఇలాంటి మోసాలకు బత్తలపల్లి నిలయంగా మారింది. ఇటీవల కొందరు కూడలిలో ఆటోవాలా వద్దకు వెళ్లి ఇలాగే ఇచ్చారు. అలాగే జొన్నరొట్టెలు అమ్మి వృద్ధురాలికి ఇలాగే మోసం చేశారు. ఇలా వారి మోసానికి చిరువ్యాపారులే బలి అవుతున్నారు. దొంగనోట్లా అంటే అది కాదు. కలర్ జిరాక్స్ చేసి వాటిని ఇచ్చి సొమ్ము చేసుకుంటున్నారు. ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.



రూ. 200 ల జిరాక్స్ నోటు

ప్రతిభా విద్యార్థులకు బహుమతులు

ప్రజాశక్తి - గాండ్లపెంట

ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో విజిలెన్స్ వారోత్సవాలలో భాగంగా అవినీతి నిర్మూలన సమాజ బాధ్యత అనే అంశంపై స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ టి భరత్ ప్రవీణ్, అసిస్టెంట్ మేనేజర్ డి శ్రావణ్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సిద్ధారెడ్డి,ఉపాధ్యాయులు పామిడి ముంతాజ్ అలీ, చిన్నప్పయ్య, గంగాధర్, రాజగోపాల్, పిఇటిలు హరి, రాయుడు, బ్యాంకు సిబ్బంది నాగేంద్ర, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

సాగునీటి సంఘం ఎన్నికలకు ఏర్పాట్లు

ప్రజాశక్తి - బుక్కపట్నం

సాగునీటి సంఘం ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తహశీల్దార్ షాబుద్దీన్ తెలిపారు. బుక్కపట్నంతో పాటు, మారాల, గూనిపల్లి, అగ్రహారం గ్రామాలలో సాగునీటి ఎన్నికల జరుగుతాయని చెప్పారు. ఈసందర్భంగా ఎన్నికలకు సంబంధించి ఓటరుజాబితాను ప్రచురించారు. ఈ ఓటరు జాబితాలో మార్పులు చేర్పులు, అభ్యంతరాలు ఉంటే స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సంప్రదించి మార్పులు చేర్పులు చేసుకోవాలని తెలిపారు.

వేతనాలివ్వాలని 104 సిబ్బంది వినతి

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

మూడు నెలల నుండి వేతనాలు రాక కుటుంబ పోషణ కష్టతరమైందని 104 సిబ్బంది నోడల్ అధికారికి విన్నవించుకున్నారు. ఈ మేరకు శ్రీసత్య సాయి జిల్లా 104 సిబ్బంది ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం నోడల్ ఆఫీసర్‌కి బుధవారం వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ తమకి 3 నెలలు నుండి వేతనాలు అందలేదని, దాంతో కుటుంబాలను పోషించటం కష్టతరమవుతోందని వాపోయారు. 104 సేవలను ప్రభుత్వమే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా కేవలము 50 వేలు రూపాయల ఖర్చుతో నిర్వహించి ప్రజాధనాన్ని వృథాకాకుండా చూడాలని కోరారు. 2020 తరువాత విధుల్లో చేరిన డ్రైవర్, డిఇఒలకు జీవో 7 ద్వారా వేతనాలు ఇవ్వాలని విన్నఇంచారు. ఉద్యోగులకు యాజమాన్యం నుండి రావలసిన ఇతర బకాయిలు చెల్లించే విధంగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుని ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో 104 సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్ బాబు, డ్రైవర్లు నరేష్, డిఇఒ లక్ష్మిపతి, అబ్దుల్, నరసింహులు, బాబా బుడెన్, పీజీ. సాయి కుమార్, అక్కులప్ప తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న 104 సిబ్బంది

భూ కబ్జాలపై ఉక్కుపాదం

ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

ప్రజాశక్తి - కదిరి టౌన్

రాజకీయ ముసుగులో భూ దందాలకు పాల్పడ్డిన వారిపై ఉక్కుపాదం మోపుతామని ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయ ముసుగులో మాజీ ఎమ్మెల్యే ,మాజీ మంత్రి ,వైసిపి నేతలు భూ దందాలకు పాల్పడ్డారని అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సున్నపు గుట్ట తండా లోని బైపాస్ రోడ్డు పక్కనే 462, 470, 479 సర్వే నెంబర్లలో పేదల ముసుగులో అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. 70 పట్టాల్లో 23 పట్టాలు లబ్ధిదారులకు అందజేశారని మరో 67 పట్టాలు ఏ ప్రకారంగా లబ్ధిదారులను గుర్తించారో తెలపాలని అన్నారు. కదిరి మున్సిపాలిటీ సున్నపు గుట్ట తండా వాసులకు కాకుండా ఇతర ప్రాంతాలకు ఈ పట్టాలను అమ్మేశారని ఆరోపించారు. ఈ విషయంపై రెవిన్యూ అధికారులకు ఫిర్యాదు చేస్తామని వారితోనే కేసులు పెట్టిస్తామని చెప్పారు. తాను రాజకీయ కక్షతో చేయలేదని అన్ని ఆలోచించి పూర్తిస్థాయిలో పరిశీలించి చెపుతున్నానని స్పష్టం చేశారు. ప్రభుత్వ భూములను కబ్జా చేసిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని అన్నారు. ఉచిత విధానంలో ఎవరైనా అదనంగా డబ్బులు వసూలు చేస్తే వారు ఎలాంటి వారైనా ఉపేక్షించే పరిస్థితి లేదన్నారు. అలాంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఉచితంగా ఎద్దులబండి, ట్రాక్టర్లలో సొంతానికి ఇసుక తెచ్చుకోవచ్చని డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదని చెప్పారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

జూదరులు అరెస్టు

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి డీఎస్పీ శివన్నారాయణ స్వామి ఆధ్వర్యంలో కోడి పందాల స్థావరాలపై పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు. కదిరి సబ్ డివిజన్లోని తలుపుల మండలం సమీప ప్రాంతంలో కోడి పందేలు నిర్వహిస్తున్నట్లు పోలీసులకు వచ్చిన సమాచారం దాడులు నిర్వహించారు. కోడిపందేలు ఆడుతున్న 20 మందిని అరెస్టు చేయడంతో పాటు వారి నుండి 60,200 రూపాయల నగదు, 20 ద్విచక్ర వాహనాలు, 20 సెల్ ఫోన్లు, 8 కోళ్ల స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు .

విద్యుత్ ప్రమాదంలో వృద్ధురాలికి గాయాలు

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

పట్టణంలోని సాయినగర్‌కు చెందిన వృద్ధురాలు విద్యుత్ ప్రమాదంలో గాయపడింది. సాయినగర్‌కు చెందిన లక్ష్మమ్మ (75) బుధవారం స్థానిక రంగా సినీ కాంప్లెక్స్ సమీపంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మూత్ర విసర్జన చేస్తుండగా ప్రమాదవశాత్తు కరెంటు షాక్ గురైంది. కుటుంబ సభ్యులు లక్ష్మమ్మను ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొని వచ్చి చికిత్స చేయించారు. అనంతరం ఆమెను అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. లక్ష్మమ్మ ఆకుకూరల వ్యాపారం చేస్తూ జీవనం చేస్తుండేదని స్థానికులు తెలిపారు.

ఆలయ అభివృద్ధికి సహకరించండి

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

పట్టణంలోని సిద్దయ్యగుట్టలో ఉన్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ నిర్మాణానికి దాతలు సహకరించాలని ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షురాలు సంకారపు జయశ్రీ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయ కమిటీ సమావేశంలో ఆలయ నిర్మాణం త్వరితగతిన చేపట్టేందుకు చర్చలు నిర్వహించామని తెలిపారు. దాతలు ఎవరైనా ధన రూపేనా, వస్తు రూపేనా సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పుట్లూరు నరసింహులు, గడ్డం పార్థసారథి, కలవల మురళీధర్, అంబటి అవినాష్, ఓవి ప్రసాద్, అంజలికృష్ణ, బాలగంగాధర్ తిలక్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి గ్రామసభలు

ప్రజాశక్తి - రొద్దం

మండలంలోని శుక్రవారం నుంచి గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ నాగేంద్ర తెలిపారు. 8వ తేదీన కొగిర,12న భూచెర్ల,13బాక్సంపల్లి,14న తురకలపట్నం, వెంకటాపురం,15న లోచర్ల, 19న సానిపల్లి,పెద్దిపల్లి, 20న చిన్నమంతురుతో పాటు వచ్చే నెల 10వరకు మండలంలో అన్ని పంచాయితీలలో గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

టిడిపి సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి - చిలమత్తూరు

స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శి సురేంద్ర ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. మండలంలోని మొరంపల్లిలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ రంగారెడ్డి, గంగాధర్, టీడీపీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పరిగి : మండల వ్యాప్తంగా నిర్వహిస్తున్న సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేసి పూర్తి చేసేలా నాయకులు కార్యకర్తలు చొరవ చూపాలని టిడిపి మండల కన్వీనర్ గోవింద్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం గతం కన్నా ఈ సారి మెరుగ్గా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల కన్వీనర్ గోవింద్ రెడ్డి, నాగరాజు, నాగభూషణం, లక్ష్మణరావు, డిఎస్ఎల్ శ్రీనివాసులు, మహేష్, డీలర్ బలరాం, మూర్తి, రామాంజి తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే గ్రామసభలు

ప్రజాశక్తి- పరిగి

మండలంలోని 14 పంచాయతీల్లోని గ్రామాలలో ఉన్న భూ సమస్యలను పరిష్కరించాలని ఉద్దేశంతో ఈనెల 8 నుండి 27 వరకు ఆయా గ్రామాలలో గ్రామసభలు నిర్వహిస్తున్నామని తహశీల్దార్ తెలిపారు. గ్రామ సభల్లో సమస్యలు తెలియజేయాలన్నారు. 8న ఊటకూరు, 12న శీరేకులం, 13న ఎర్రగుంట, 14న పి.నరసాపురం, 15న పైడిటి, 19న శాసనకోట, 20న శ్రీరంగరాజుపల్లి , 21న పరిగి, 22న మోద, 26న కొడిగేనహళ్లి, 27న బీచిగానిపల్లిలో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ హసీనా సుల్తానా చెప్పారు.

పట్నం ఎస్ఐగా రాజశేఖర్

ప్రజాశక్తి - ముదిగుబ్బ

మండల పరిధిలోని పట్నం పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా రాజశేఖర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. పట్నం పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ నరసింహులు తలుపులకు బదిలీపై వెళ్లగా, రొళ్ల మండలం నుండి బదిలీపైవచ్చిన రాజశేఖర్ పట్నం పోలీస్ స్టేషన్‌లో బాధ్యతలు తీసుకున్నారు. ఈసందర్భంగా పట్నం పోలీస్ స్టేషన్ సిబ్బంది ఎస్ఐకి శుభాకాంక్షలు తెలిపారు.

ట్రాన్స్‌కో ఎఇగా జయవర్ధన్ రెడ్డి

ప్రజాశక్తి - చిలమత్తూరు

చిలమత్తూరు విద్యుత్ శాఖ ఏఈగా జయవర్ధన్ రెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ మండలంలో విద్యుత్ రంగ సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు. అలాగే ప్రజలు ఎలాంటి విద్యుత్ సమస్యలు ఉన్నా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

ప్రజాశక్తి-గుత్తి

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తే ఉద్యోగావకాశాలు దక్కుతాయని శ్రీ సాయి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.వెంకటేశ్వర్లురెడ్డి తెలిపారు. కళాశాలలో డిగ్రీ(బీఏ) ద్వితీయ సంవత్సరం చదువుతున్న సానియా గుంతకల్లులో జరిగిన తైక్వాండో ఇంటర్ కాలేజీ టోర్నమెంట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచి జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైంది. దీంతో బుధవారం కళాశాలలో అభినందన సభ నిర్వహించారు. సానియాకు శాలువా కప్పి సత్కరించి బహుమతి అందజేశారు. డాక్టర్ సి.వెంకటేశ్వర్లు రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు క్రీడల ద్వారా ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. ఈ నెల 11 నుంచి 15వ తేదీ వరకూ పంజాబ్‌లో జరిగే తైక్వాండో జాతీయస్థాయి పోటీల్లో సానియా అత్యుత్తమ ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు.

పగిలిన రక్తనాళం అతికించిన వైద్యులు

కిమ్స్ సవీరాలో ఉచిత చికిత్స

ప్రజాశక్తి-అనంతపురం

తీవ్రమైన ఆయాసం, దగ్గితే రక్తం పడుతున్న 62 ఏళ్ల వ్యక్తికి బుధవారం నగరంలోని కిమ్స్ సవీరా ఆసుపత్రి వైద్యులు విజయవంతంగా శస్త్రచికిత్స చేసి ప్రాణాలు కాపాడారు. ఆసుపత్రి సీనియర్ కన్సల్టెంట్, ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్టు డాక్టర్ మూడే సందీప్ తెలిపిన వివరాలు.. ధర్మవరం పట్టణానికి చెందిన 62 ఏళ్ల రైతు 3 నెలలుగా తీవ్రమైన ఆయాసంతో బాధపడుతున్నారు. దగ్గుతుంటే నోట్లోంచి రక్తం పడేది. ఈయనకు ఇంకా పలు ఆరోగ్య సమస్యలు ఉండేవి. ఆసుపత్రికి రాగా ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్టు డాక్టర్ యశోవర్ధన్ మంగిశెట్టి ఆధ్వర్యంలో పరీక్షలు చేసి ఊపిరితిత్తులకు వెళ్లే రక్తనాళాల్లో ఒకటి పగిలినట్లు గుర్తించారు. అరగంట పాటు శస్త్రచికిత్స చేసి రక్తనాళాన్ని సరి చేశారు. ఈ సమస్యకు కార్పొరేట్ ఆస్పత్రుల్లో రూ. 2 లక్షలు ఖర్చవుతుంది. కానీ మేము ఆరోగ్యశ్రీ కింద పూర్తి ఉచితంగా చేశామని తెలిపారు. ఆయనతో పాటు డాక్టర్ మంగిశెట్టి యశోవర్ధన్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

'ఆర్ఆర్' ఫర్టిలైజర్స్ ప్రారంభం

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని బళ్లారి రోడ్డులో ఉన్న ఆగ్రోస్ ఎదురుగా నూతనంగా నిర్మించిన ఆర్ఆర్ ఫర్టిలైజర్స్ షోరూంను బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. నిర్వాహకులు రాజేష్, రాము మాట్లాడుతూ 15 ఏళ్లుగా జిల్లా రైతుల ఆదరణతో ఆర్ఆర్ ఫర్టిలైజర్స్ నూతన షోరూంను ప్రారంభించామని తెలిపారు. తమ షోరూంలో పురుగుమందులు, ఎరువులు, విత్తనాలు లభిస్తాయని తెలిపారు. రైతులకు నిరంతరం అందుబాటులో ఉంటూ అన్ని రకాల పంటలను కాపాడేందుకు అవసరమైన మందులు అందజేస్తామని తెలిపారు. వ్యవసాయం తోటల సంరక్షణలో విశ్వసనీయ భాగస్వామిగా ఆర్ఆర్ ఫర్టిలైజర్స్ రైతులకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు లక్ష్మీ నారాయణ, భాస్కర్, తాతిరెడ్డి, ప్రతాపరెడ్డి, ప్రముఖులు పాల్గొన్నారు.

ఆరోగ్య పోషణపై అవగాహన

ప్రజాశక్తి - మడకశిర

మండల పరిధిలోని కల్లుమర్రి అంగన్వాడీ కేంద్రంలో ఆరోగ్య పోషణ అవగాహన సదస్సును బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బి సాయి రెడ్డి మాట్లాడుతూ వ్యాధి నిరోధక టీకాలు ప్రాముఖ్యత గురించి వివరించారు. చిరుధాన్యాలైన రాగులు, సజ్జలు, కొర్రలు, జొన్నలు మొదలైనవి ఆహారంలో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ రామ్ ప్రసాద్, హెల్త్ అసిస్టెంట్ విజయ, మహిళా పోలీస్ గౌతమీ, అంగనవాడీలు సిద్ద గంగమ్మ, నాగమణి, నందిని, ఆశవర్కర్ కవిత, శాంతమ్మ, గ్రామస్తులు గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభం

ప్రజాశక్తి గోరంట్ల

మండలంలోని బూదిలి పంచాయతీ గొల్లపల్లి సమీపాన నూతనంగా ఏర్పాటుచేసిన విద్యుత్ సబ్‌స్టేషన్‌ను రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గురువారం ఉదయం 11 గంటలకు వర్చువల్‌గా ప్రారంభిస్తున్నట్లు టిడిపి మండల కన్వీనర్ సోమశేఖర్ తెలిపారు. ఈ సబ్ స్టేషన్ ప్రారంభోత్సవానికి రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారన్నారు. మండలంలోని కూటమి నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

జర్నలిస్టుల మండల కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి - కొత్తచెరువు రూరల్

కొత్తచెరువు మండల వర్కింగ్ జర్నలిస్ట్ నూతన వర్కింగ్ కమిటీని బుధవారం ఎంపిక చేశారు. మండల కేంద్రంలోని టీటీడీ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నూతన వర్కింగ్ జర్నలిస్టుల అధ్యక్షునిగా నూరుబాషా ఉపాధ్యక్షులుగా ఎస్ఎన్ నరసింహులు, లక్ష్మీనారాయణ, గౌరవ అధ్యక్షులుగా సివిఆర్ సూరి, ప్రధాన కార్యదర్శిగా చాపిరెడ్డి హరిప్రసాద్ కోశాధికారిగా కేశవ, ఉప కార్యదర్శిగా షేక్షావలి, రామాంజనేయులు, పసలచంద్ర ,గౌస్‌బాషా, బాబు, ఈసీ మెంబర్లుగా శ్రీరాములు, శ్రీనివాసులు, మహేష్, జావిద్‌లను ఎంపిక చేశారు.

15 నుంచి బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలో ప్రసిద్ధిగాంచిన గుడ్డం రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 15వ తేదీ నుండి ప్రారంభిస్తున్నట్లు ఆలయ ఎగ్జిక్యూటివ్ అధికారి నాగేంద్రుడు తెలిపారు. 15న ఉదయం సుప్రభాత సేవతో పూజా కార్యక్రమాలు ప్రారంభమవు తాయన్నారు. ప్రాకారోత్సవం అంకురార్పణ నిర్వహించనున్నట్లు చెప్పారు. 16న ధ్వజారోహణం, ప్రవేశం, సాయంత్రం 6 గంటలకు శ్రీదేవి భూదేవి సమేత రంగనాథ స్వామి కళ్యాణోత్సవం జరుగుతుందని తెలిపారు. అలాగే 17న ప్రాకారోత్సవం, ధాత్రి హోమం, మధ్యాహ్నం ఒంటిగంటకు స్వామివారి బ్రహ్మరథోత్సవం జరుగుతుందన్నారు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు వడిబియ్యం, 5 గంటలకు అన్నమయ్య గానలహరి, సాయంత్రం 7 ఏడు గంటలకు సహస్ర దీపాలంకరణ జరుగుతుందన్నారు. దీనికి తోడు 18న సుప్రభాత సేవ, ప్రాకారోత్సవం, వంటి పూజలు జరుగుతాయన్నారు. 19వ తేదీ ప్రాకారోత్సవం, వసంతోత్సవం, చక్రస్నానం, సాయంత్రం 6 గంటలకు వెండి ముత్యాల పల్లకిలో నగరోత్సవం వంటి పూజలు జరుగుతాయన్నారు. ఈ బ్రహ్మోత్సవాల్లో అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

గ్రామ సభలు

ప్రజాశక్తి - బత్తలపల్లి

తాడిమర్రి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించిన నేపథ్యంలో ఉపాధి పథకం కింద కరువు పనులు గుర్తించడానికి అధికారులు గ్రామసభలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా బుధవారం మండలంలోని నిడిగల్లు గ్రామపంచాయతీలో గ్రామసభను నిర్వహించారు. భూగర్భ జలాల పెంచుటకు ఫారం పాండు, నీటి కుంటలు, ట్రెంచ్ పనులు, చెక్ డ్యాంల పూడిక తీత మొదలగు నీటి సంరక్షణ పనులను గుర్తించారు. ఈ కార్యక్రమంలో ఎపిడి వెంకటాచలపతి, ఇఒఆర్‌డి విజయశేఖర్ నాయుడు, ఏపీవో సంజీవరెడ్డి, పంచాయతీ కార్యదర్శితో పాటు ఉపాధి హామీ, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు .



గ్రామసభలో పాల్గొన్న అధికారులు, తదితరులు



సమావేశంలో మాట్లాడుతున్న స్పెయిన్ దేశస్తుడు

ఆర్డీటీ సేవలు ఆదర్శనీయం

ప్రజాశక్తి - గుడిబండ

ఆర్‌డిటి నిరుపేదలకు అందిస్తున్న సేవలు ఆదర్శనీయమని స్పానిస్ మిత్రబృందం పేర్కొంది. మండలంలో కుగిర్నపాలెం గ్రామంలో నిరుపేదలకు ఆర్డీటీ ద్వారా 29 గృహాలు మంజూరయ్యాయి. ఇళ్లలబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాల్ని పూర్తిచేసుకొని ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి 9 మందితో కూడిన స్పానిష్ మిత్రబృందం బుధవారం కుగిర్నపాలెం గ్రామానికి వచ్చింది. వారు గృహాల ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఆర్టీటీ అందజేస్తున్న సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆర్డీటీ ఆర్డీ మల్లికార్జున, ఏటీఎల్ మీనాక్షి, గుడిబండ, రొళ్ల ఎటిఎల్‌లు మీనాక్షి, ఓబులేసు, రీజినల్ ఇంజనీర్ రంగనాయకులు, ఏరియా ఆర్‌డిటి సిబ్బంది పాల్గొన్నారు.

టీటీడీ పాలకమండలి సభ్యులుగా ఎంఎస్.రాజు ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - మడకశిర

తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యులుగా మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ఎమ్మెల్యే టీటీడీ సభ్యులు ఎంఎస్ రాజు సతీమణి ఉమాదేవి, కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ ప్రమాణస్వీకారం కార్యక్రమంలో ఎంపీ పార్థసారథి, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి, నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య, సినీ యాక్టర్ రఘు, సినీ హీరో సప్తగిరి, గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, సత్య సాయి జిల్లా లీగల్ సెల్ కార్యదర్శి గుండుమల రాధాకృష్ణ, కన్వీనర్లు గణేష్, లక్ష్మీనారాయణ, మదనకుంటప్ప, దాసిరెడ్డి, రాష్ట్ర తెలుగు రైతు కార్యదర్శి కేఎంపల్లి సురేష్, తెలుగు యువత కార్యదర్శి మారుతి ప్రసాద్, మాకం రమేష్ తదితరులు పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారం అనంతరం నాయకులతో ఎంఎస్. రాజు

పంటల బీమా ప్రీమియం చెల్లించండి



తాడిమర్రి మండలంలో పొలంబడిలో అధికారులు, రైతులు

ప్రజాశక్తి - బత్తలపల్లి

మండలంలోని తాడిమర్రి మండలంలోని ఆత్మకూరు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మండల వ్యవసాయ అధికారిని రమాదేవి మాట్లాడుతూ రబీ 2024-25 సంవత్సరం నుంచి రైతులు పంటల బీమా లబ్ధి పొందాలంటే నిర్దేశిత కాలంలో సంబంధిత పంటలకు నిర్ణయించిన ప్రీమియం నగదును చెల్లించాలని కోరారు. అదేవిధంగా ఈ పంట నమోదు తప్పనిసరిగా చేయించుకుంటేనే పంటల బీమా వర్తిస్తుందని తెలిపారు. ప్రస్తుతం రబీ 2024 25 సీజనుకి సంబంధించి వాతావరణ బీమా ఆధారంగా టమోటా పంటను ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద వేరుశనగ, వరి పంటలను నోటిఫై చేయడం జరిగిందన్నారు. ఇందులో టమాటా పంటకు 1600 రూపాయలు, వేరుశనగ పంటకు 480 రూపాయలు, వరికి 630 రూపాయలు ఎకరాకు రైతులు ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. అంతేకాకుండా ప్రీమియం నగదును లోన్ ఉన్న రైతులు అయితే సంబంధిత బ్యాంకులో, లోన్ లేని రైతులయితే మీసేవ నేషనల్ క్రాఫ్ ఇన్సూరెన్స్ పోర్టల్‌లో ప్రీమియం నగదు చెల్లించవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు గ్రామ సర్పంచి వెంకటనారాయణ రెడ్డి, అగ్రికల్చర్ అసిస్టెంట్ నిజాముద్దీన్, పంచాయతీ కార్యదర్శితో పాటు రైతులు శ్రీనివాసులు, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి : మండలంలోని బసవన్న పల్లి, మైదుగోళం గ్రామాల్లో వ్యవసాయ శాఖ అధికారులు బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎడిఎ సనావుల్లా పంటసాగు పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు.. ఈ సమావేశంలో మండల వ్యవసాయ అధికారి శ్రీలత, పట్టు పరిశ్రమ శాఖ అధికారి చంద్రమోహన్ రెడ్డి, ఉద్యాన శాఖ అధికారితో పాటు ఎఇఒ లక్ష్మీనారాయణ, రైతు సేవ కేంద్రం సిబ్బంది పార్థసారథి, హరి, ప్రజా ప్రతినిధులు రైతులు పాల్గొన్నారు.

రీ సర్వే సమస్యలు వెంటనే పరిష్కరించాలి

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

ధర్మవరం సబ్ డివిజన్ పరిధిలోని రీ సర్వే సమస్యలపై వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని డిఎఒ ఖతిజూన్ కుబ్రా అన్నారు. ఆర్డీవో మహేష్ ఆదేశాల మేరకు డివిజన్లోని మండల తహశీల్దార్లు, మండల సర్వేయర్లు, గ్రామ సర్వేయర్లతో బుధవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఖతిజున్ కుబ్రా మాట్లాడుతూ కలెక్టర్, రెవెన్యూ డివిజనల్ అధికారి మహేష్ ఆదేశాల మేరకు రీ సర్వే పూర్తి అయిన వివరాలను వెంటనే పంపాలని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో స్వీకరించిన అర్జీలు, సర్వీస్ లెవెల్ అగ్రిమెంటు లోపు పూర్తి చేయాలని చెప్పారు. అదేవిధంగా రీ సర్వే గ్రామసభలలో వచ్చిన అర్జీలకు నోటీసులను వెంటనే జారీచేసి, పొలం వద్ద హాజరైన పట్టాదారుల అంగీకారంతో నివేదికను తీసుకొని మండల సర్వేయర్లు, తహశీల్దార్ల లాగిన్‌లో నుండి సర్వే భూమి రికార్డుల అధికారి పుట్టపర్తి వారికి పంపి వారితో అంగీకారం తీసుకోవాలని తెలిపారు. అనంతరం ఎల్‌పిఎం కరెక్షన్ మోడ్యూల్ ద్వారా పూర్తి చేసి రీ సర్వే జరిగిన గ్రామాలలో రైతుల సమస్యలు పరిష్కరించాలని సూచించారు. రీ సర్వే గ్రామసభల్లో జాయింట్ ఎల్పీఎంలు కేటాయించిన రైతుల దాఖలు చేసిన సబ్ డివిజన్ దరఖాస్తులు వెనువెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఏడు మండలాల తహశీల్దార్లు, డివిజనల్ ఇన్స్‌పెక్టర్లు, అంజలీదేవి, మురళీకృష్ణ, శామ్యూల్ బాబు, అన్ని మండలాల మండల, గ్రామ సర్వేయర్లు, మాస్టర్ ట్రైనర్లు తదితరులు పాల్గొన్నారు.

పోటాపోటీగా ఫ్రెండ్లీ క్రికెట్

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో పోలీసులకు, విలేకరులకు బుధవారం నిర్వహించిన ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ రసవత్తంగా కొనసాగింది. ఈ క్రికెట్ మ్యాచ్ సందా రాఘవ ఆధ్వర్యంలో నిర్వహించారు. టాస్ గెలిచి బ్యాటింగ్‌ను ఎంచుకున్న పోలీస్ జట్టు 14 ఓవర్లలో మూడు వికెట్లకు 155 పరుగులు చేసింది. అత్యధికంగా సిఐ నాగేంద్రప్రసాద్ 65 పరుగులతో, ఇషాక్ 42 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్ దిగిన ప్రెస్ క్లబ్ జట్టు మొదటి నాలుగు ఓవర్లో బాగా రాణించినప్పటికీ జట్టులో నిలకడగా బ్యాటింగ్ చేయకపోవడం వలన 14 ఓవర్లో 97/7 వికెట్లను సమర్పించింది. దీంతో పోలీస్ జట్టు 58 పరుగులతో విజయం సాధించింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు వన్‌టౌన్ సిఐ నాగేంద్రప్రసాద్‌కు దక్కింది. తదుపరి మ్యాచ్‌లో సందా రాఘవ, మున్సిపాలిటీ జట్లు తలపడ్డాయి. ఈ పోటీలో సంద రాఘవ టీం విజయం సాధించింది.



క్రీడాకారులతో నిర్వాహకులు

ఆముదం పంట సాగుకు అనుకూలం

ప్రజాశక్తి బత్తలపల్లి

మారుతున్న వాతావరణ పరిస్థితులకు, వ్యవసాయంలో సాగు ఖర్చులు తగ్గించుకునేందుకు ఆముదం పంట అనుకూలమైందనిపలువురు శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని జ్వాలాపురం గ్రామంలో ఆముదం పంట మీద క్షేత్ర దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. అందులో భాగంగా హైదరాబాద్ లోని భారతీయ నూనె గింజల పరిశోధన సంస్థ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ మంజునాథ్, రేకులకుంట వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం. విజయశంకర్‌బాబు, జిల్లా వ్యవసాయాధికారి వైవి. సుబ్బారావుతో పాటు పలువురు శ్రీసత్యసాయి జిల్లా, రేకులకుంట పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు హాజరయ్యారు. ఈసందర్భంగా వారు రైతులతో కలిసి పంట పొలాలను పరిశీలించారు. రైతులకు ఆముదం సాగులో మెలుకువలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రేకులకుంట వ్యవసాయ పరిశోదన స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ ఆర్ నసీరుద్దీన్, ఎల్. మాధవీలత, భాస్కరరావు, లక్ష్మీకళ్యాణి, కెవికె కళ్యాణదుర్గం ప్రోగ్రాం కోఆర్డినేటర్ చంద్రాయుడు, రెడ్డిపల్లి ప్రోగ్రాం రోఆర్డినేటర్ మల్లీశ్వరి, వీడీఏ క్రిష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై పనిఒత్తిడి తగ్గించాలి

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

ఉపాధ్యాయులపై ప్రభుత్వం పని ఒత్తిడి పెంచడం భావ్యం కాదని అదనపు పనులు తగ్గించాలని జిల్లా వైయస్సార్ ఉపాధ్యాయుల అసోసియేషన్ అధ్యక్షులు పివి. రమణారెడ్డి, నాయకులు సుబ్బారెడ్డి, మధుసూదన్ రెడ్డి, వాసు, చిదాంబర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పర్మనెంట్ ఐడి నెంబర్(అపార్) నమోదు చేయాలని ఉపాధ్యాయులపై ప్రభుత్వం ఒత్తిడి పెట్టిందన్నారు. ఆధార్‌లో ఒక రకంగా విద్యార్థుల రిజిస్టర్లో ఇంకొక రకంగా నమోదు కావడంతో వాటిని ఎప్పటికప్పుడు పంపలేక పోతున్నామన్నారు. వీటి నమోదుకు అవసరమైన ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు.

ఆధార్ సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి - ఓబుళదేవర చెరువు

మండల కేంద్రంలో ఆధార్ సెంటర్ లేక మండల ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఈ నేపథ్యంల ఆధార్ సెంటర్ ఏర్పాటు చేయాలని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ఆంజనేయులు కోరారు. ఈ మేరకు వారు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ అనంత చారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చలపతి, చంద్ర పాల్గొన్నారు.

సమైక్యతా శిబిరానికి ఎస్‌కెయు విద్యార్థులు

ప్రజాశక్తి-అనంతపురం

గుజరాత్‌లో ఈ నెల 8 నుంచి 14వ తేదీ వరకూ జరిగే జాతీయ సమైక్యతా శిబిరంలో ఆంధ్రప్రదేశ్ నుంచి ఎస్‌కెయు ఎన్ఎస్ఎస్ విభాగం నుంచి 11 మంది పాల్గొంటారని విసి ప్రొఫెసర్ అనిత తెలిపారు. వారికి విసి అనిత, రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ మురళీధర్ శుభాకాంక్షలు తెలిపారు. శిబిరంలో అన్ని విభాగాల్లో ప్రతిభ చాటి మంచి పేరు తీసుకు రావాలని ఆకాంక్షించారు. ఈ బృందానికి కంటెంజెంట్ ఇన్‌ఛార్జిగా డాక్టర్ కోనంకి శ్రీధర్ వెళ్తున్నారు. ఎంపికైన వాలంటీర్ల వివరాలు.. బి.అమృత(ఆర్ట్స్ కాలేజీ), డి.రాఘవి(కెఎస్ఎన్), బి.నవ్యశ్రీ(ఎస్‌కెయు ఫార్మసీ), ఎ.లోహిత(ఎస్‌వి), ఎం.సాయిహర్షిత(ఎస్ఎస్‌పిఆర్, హిందూపురం), అబ్దుల్ రెహ్మాన్ (రాయ దుర్గం), టి.మంజునాథ్ (ఎస్‌బివివి, హిందూపురం), యు.పవన్(ఎస్‌కెపి, గుంతకల్లు), జికె. రఘువర్ధన్ (ఎస్‌వైటిఆర్, మడకశిర), కె.ధనుష్(కెహెచ్ డిగ్రీ కాలేజీ, ధర్మవరం).